# బందీ

సుజాత ఉలిక్కిపడి లేచింది. తలుపు ఎవరో తడ్తున్న చప్పుడు.

మధ్యాహ్నం భోంచేశాక ఓ కునుకు తీయటం ఆమె దిన చర్యల్లో ఒకటి. అలా పడు కున్నప్పుడు ఏ సేల్స్ గర్లో వచ్చి అత్యవసరమైన పని ఉన్నట్లు తలుపు తట్టి నిద్రాభంగం కలిగించటం పరిపాటే.

బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ గోడ గడియారం వైపు చూసింది.

మూడు గంటలు కావస్తోంది.

అంటే తను దాదాపు గంటన్నర నిద్రపోయిందన్మాట.

మరలా తలుపు తట్టిన చప్పుడు. ఈసారి కొద్దిగా గట్టిగా -

తలుపు తడ్తున్న వ్యక్తిలోని అసహనం అందులో స్పష్టంగా తెలుస్తోంది.

తప్పకుండా సేల్స్ గర్ల్ అయి ఉండదు.

చప్పున మంచం దిగి ముందు గదిలోకి నడిచింది.

తలుపు ఓరగా తెరిచింది.

ఎదురుగా ఓ యువకుడు నిలబడి ఉన్నాడు.

అతన్ని తను చాలా సార్లు చూసింది. ఎదురింటి మేడ మీద అద్దెకుండే కాలేజీ కుర్రవాళ్ళలో ఒకతను.

ఆగదిలో ముగ్గురు అబ్బాయిలు అద్దెకుంటారు. కానీ ఇతను మాత్రం తనవైపు అదోలా చూడటం సుజాత చాలాసార్లు గమనించింది.

అందుకే అదో రకమైన ఏవగింపు అతన్ని చూస్తుంటే. . . .

మొహం చిట్లించి "ఏం కావాలి" అని అడిగింది.

"సార్ మొన్న నా పుస్తకం తీసుకున్నారు మేడం. అది అద్దెకు తెచ్చిన పుస్తకం. ఈ రోజు ఇచ్చేయాలి" తల వొంచుకుని బిడియంగా చెప్పాడు.

"ఏం పుస్తకం?" అడిగింది.

"ఇర్వింగ్ వాలెస్ రాసిన 'ది ఫ్యాన్ క్లబ్' అనే నావెల్ మేడం. సార్‌కిచ్చి మూడ్రోజులైంది. ఇప్పటికే అద్దె చాలా అయి ఉంటుంది. దయచేసి ఆ పుస్తకం ఇచ్చేస్తే-షాపు వాడికి తిరిగి ఇచ్చేస్తాను" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లు. . .

తన భర్త ఇతనితో మాట్లాడటం సుజాత రెండు మూడు సార్లు చూసింది. అదీగాక ఆమె భర్తకు ఇంగ్లీష్ నావెల్స్ చదివే అలవాటుంది.

తన భర్త ఆఫీసు నుండి వచ్చాక రమ్మని చెప్పాలనుకుంది. కానీ అతని మాటల్లో తన భర్త వల్లనే అద్దె ఎక్కువ కట్టాల్సి వస్తుందన్న నిష్ఠూరం ధ్వనించినందువల్ల "సరే చూస్తానుండు" అని లోపలి గదిలోకి వెళ్ళింది. తన భర్త పుస్తకాలు పెట్టుకునే అల్మైరాలో వెదికింది. కన్పించలేదు.

"ఎక్కడ పెట్టి ఉంటారబ్బా" అని ఆలోచిస్తూ వెనక్కి తిరిగిన సుజాత అవాక్కయి నిలబడి పోయింది.

ఎదురుగా. . . వెకిలిగా నవ్వుతూ. . . . అతను. . . .

సుజాత కళ్ళు ఆశ్చర్యంతో - భయంతో - పెద్దవయ్యాయి.

పెద్దగా అరవాలని నోరు తెరిచింది.

అతను మెరుపులా కదిలి ఆమె నోరు ఒక చేత్తో గట్టిగా మూసి, మరో చేత్తో ప్యాంట్ జేబులోంచి తాడు, మఫ్లర్ లాంటి గుడ్డ తీశాడు. మొదట మఫ్లర్‌తో ఆమె నోటిని బలంగా కట్టేశాడు. తర్వాత చేతుల్ని ముందుకు పెట్టి గట్టిగా తాడుతో కట్టేశాడు.

ఆమెను బలంగా మంచం మీదికి తోసి పైన బడ్డాడు.

ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న సుజాత మోకాలు మడిచి శక్తినంతా కేంద్రీకరించి పొత్తి కడుపులో కొట్టింది.

అతను ఎగిరి కిందపడ్డాడు. అతని ముఖంలో అంతులేని బాధ - దాంతోపాటు కోపం, అవమానం, కసీ కలగలిపి కన్పించాయి.

అంతటి బాధలోనూ అతనికో క్రూరమైన ఆలోచన వచ్చింది.

అప్పటికే మంచం మీంచి లేచిన సుజాత బలం కొద్దీ అతని ముఖం మీద కాలితో తన్నింది.

అతని పెదవి చిట్లి రక్తం కారడం చూసాక సుజాతలో ఎక్కడలేని బలం వచ్చింది.

అతను ఒక్క ఉదుటున లేచాడు. తనని ఎటాక్ చేస్తాడని సన్నద్ధమైన సుజాత ఆశ్చర్యపడేలా వంట గదిలోకి పరుగెత్తాడు.

మరుక్షణం చేతిలో కత్తితో తిరిగొచ్చాడు.

మొదట సుజాత భయపడింది. వెంటనే సర్దుకుంది. ఆమెలో అంతులేని ధైర్యం. ప్రాణం పోయినా పర్లేదు. తను అతనికి లొంగదు.

అతని కళ్ళు ఎర్రగా నిప్పుకణికల్లా ఉన్నాయి. అతను ఒక్కో అడుగూ ముందు కేస్తున్నాడు.

సుజాత కళ్ళు మూసుకుని మొదట భగవంతుణ్ణి తల్చుకుంది. తర్వాత తన భర్తని తల్చుకుంది. తర్వాత తన బాబుని. . .

సుజాత వళ్ళు జలదరించింది. తన బాబు. . . తన రెండేళ్ళ బాబు. . . . కళ్ళు తెరిచింది.

బాబు పక్కన కత్తితో అతను. . .

"నాకు తెలుసు. నీవు చావుకి కూడా భయపడవని . అందుకే నిన్ను చంపను. వీణ్ణి చంపేస్తాను. ముక్కలు ముక్కలుగా నరికేస్తాను. నీవు తర్వాత ఏం చేసినా నీ కొడుకు నీకు తిరిగిరాడు. బుద్ధిగా లొంగావా సరేసరి. . . . లేదా. . ." కత్తి ఎత్తాడు.

బాబు అమాయకంగా నిద్రపోతున్నాడు.

సుజాత కళ్ళలో ధారాపాతంగా నీళ్ళు.

తన బాబు - తన ప్రాణం - అమ్మో ! వాడికేమైనా అయితే తను భరించలేదు. వాడు లేకుండా తను బ్రతకలేదు.

అతనికి తన ఆయువుపట్టేమిటో తెల్సిపోయింది. తనేమైనా పర్లేదు. తను నాశనమైనా తన బాబు క్షేమంగా ఉంటే చాలు.

బాబుని ఏమీ చేయవద్దని మూగగా ప్రాధేయపడ్తూ అతని కాళ్ళ దగ్గర కుప్పలా కూలిపోయింది.

అతను పైశాచికంగా నవ్వుతూ ఆమె భుజాలమీద చేతులు వేశాడు. . .

చదువుతున్న పుస్తకాన్ని విసురుగా మూసేసింది పద్మ. ఆమె మనసంతా కలచి వేసినట్లయింది. అది కథే అయినా, సుజాతని తల్చుకుంటే బోల్డంత జాలేసింది. నిజ జీవితంలో వెలుగులోకి రాకుండా మరుగున పడిపోయే ఇలాంటి సంఘటన లెన్నో . . . రేప్ అనేది ఎంతటి ఘోరం ! మరెంతటి దారుణం ! స్త్రీని ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా తన పశుబలంతోనో - బెదిరించో - భయపెట్టో. . . లొంగదీసుకోవడం - ఎంతటి హేయమైన విషయం! అలాంటి మగవాళ్ళను నడిరోడ్లో నిల్చోబెట్టి ఉరి తీసినా పాపంలేదు.

ఆమె ఆలోచనలను భంగపరుస్తూ గడియారం ఐదు గంటలు కొట్టింది.

తన భర్త రమేష్ వచ్చే టైం దగ్గిరపడే కొద్ది పద్మలో సన్నని వణుకు.

ఎప్పుడూ నవ్వుతూ ఉండే రమేష్. . . నిదానంగా, కోపఛాయలేవీ లేకుండా, బ్యాలన్స్ తప్పకుండా మాట్లాడే రమేష్. . .

పెళ్ళయిన కొత్తలో పద్మకు ఎంత ప్రాణమో ఆ నవ్వంటే. . . ఆ మాట్లాడే తీరు- మల్లెలు దోసిట్లో నింపుకుని, నింపాదిగా జార విడుస్తున్నట్లు - ఒక్కో మాటా ఆచి - తూచి.... మాటలే కాకుండా మాట్లాడే తీరులో కూడా తీయదనం ఉంటుందని అప్పుడే ఆమెకు తెల్సింది.

కానీ - మెల్లమెల్లగా . . . . రోజులు గడిచేకొద్దీ . . . .

పద్మ ఆ జ్ఞాపకాల్లో పడి విషాదంగా నవ్వుకుంది. తనెంత పిచ్చిది ! విషం తాగుతూ - ఇన్నాళ్ళూ తేనె అనుకుని భ్రమపడింది! ఓ ముల్లున్నా గులాబీని స్వీకరించవచ్చు. కానీ రేకులన్నీ బాకుల్లా గుచ్చుకునే అందమైన గులాబీ - రమేష్.

"పద్మా డియర్. బ్లూ కలర్ అంటే నాకెంతిష్టమో. అలాంటి చీరలో నిన్ను చూడాలని వుంది" అని రమేష్ అన్నప్పుడు తనెంత సంబరంగా, మనస్ఫూర్తిగా అతని కోరిక తీర్చిందో...

చిన్నప్పటి నుండీ తనకు ఆ కలరంటే ఎంత అలర్జీనో. తనకు ఆరెంజ్ ఎల్లో అంటే బోల్డంత ఇష్టం.

కానీ రమేష్ కోసం తన ఇష్టాల్ని వదులుకుంది. ఇపుడు తనక్కూడా బ్లూ కలరంటేనే ఇష్టం.

"ఈ కూరలు నాకిష్టం లేదు పద్మా. నాకు నచ్చవు. ఫలానా కూర వండు" అని అన్నప్పుడు అది తనకు నచ్చనిదైనా వండిపెట్టి తనూ తినటం నేర్చుకుంది.

పద్మకివన్నీ సంతోషాన్నే ఇచ్చాయి.

భర్త ఇష్టమే తనిష్టం అనుకుంది. అది వ్యక్తిత్వాన్ని చంపుకోటం అన్పించలేదు. భార్యాభర్తలు పాలూ నీళ్ళలా కల్సిపోవాలని కలలుకన్న తనకు తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా భర్త వ్యక్తిత్వంలో విలీనం చేయటం చాలా ఆనందాన్నిచ్చింది. తను తన భర్త నీడలా - తన భర్త ఆత్మలా - శ్వాసలా. .. .

తనెంత అమాయకురాలు ! రమేష్ తన ఇష్టాల్ని కూరలూ, చీరలతో ప్రారంభించి- చివరికి. . . .

"పద్మా డియర్. ఓ పాతికవేలు కావాలని మీ నాన్నగారికి వ్రాయి" అన్నప్పుడు పెళ్ళయి ఆర్నెల్లే. .

"నా పెళ్ళికి చేసిన యాభై వేల అప్పు ఇంకా అలానే ఉందండి. పెళ్ళి కెదిగి ఇంకో చెల్లెలుంది. ఈ పరిస్థితుల్లో ఏం బావుంటుంది చెప్పండి. అయినా ఇపుడు మనకన్ని అవసరాలేమున్నాయి" అంది.

"అవసరం నాకుంది. నేను సాయంత్రం వచ్చేలోగా ఉత్తరమైనా వ్రాయి లేదా నీవు వెళ్ళి తెచ్చినా నాకభ్యంతరం లేదు. ఏమంటావు" అన్నాడు రమేష్ నవ్వుతూ - తన బుగ్గ మీద చిటికె వేసి.

ఆ విషయాన్ని అంత యధాలాపంగా నవ్వుతూ ఎలా అడగగలిగాడో ఇప్పటికీ తనకు అర్థం కాదు.

"ఉత్తరం వ్రాసినా, వెళ్ళినా నాన్న దగ్గర ఉండాలి కదండీ. . ." అంది తన కళ్ళలో అప్రయత్నం గానే నీళ్ళు.

ఎప్పుడూ విషాదం తప్ప ఆనందం ప్రతిఫలించని తన తండ్రి మొహం గుర్తొచ్చింది. .. బడిపంతులుగా జీవితాన్ని లాక్కొస్తున్న తండ్రి మొదటి పిల్ల పెళ్ళికోసం ఉన్న పొలమంతా అమ్మాల్సి వచ్చింది. తన పెళ్ళి కోసం ఇల్లు తాకట్టు పెట్టాల్సి వచ్చింది. మరి మూడో దాని పెళ్ళికి ఏం చేయాలో తెలియక ప్రతి క్షణం మొహాన్ని ప్రశ్నార్థకంగా పెట్టుకుని అసహనంగా తిరిగే తన తండ్రి. . .

"నేను రాయలేనండీ" అంది ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"నీకో వారం ఉదారంగా టైం ఇస్తున్నాను. పాతికవేలు పట్టుకుని రాకపోతే నీవింక రానవసరం లేదు. మీ నాన్న దగ్గిరే శాశ్వతంగా ఉండిపోవచ్చు. ఆలోచించుకో" అని నవ్వినప్పుడు పూర్వం మోహనంగా, మధురంగా కన్పించిన నవ్వు ఎంత వికృతంగా అన్పించిందో. . . . ..

అలా బెదిరించటంలో కూడా ఎటువంటి ఆవేశమూ, కోపమూ లేకుండా మొహంలో అంత అద్భుతమైన ప్రశాంతతని నింపుకుని మాట్లాడగలిగిన తన భర్త మీద అంతులేని అసహ్యం తనకు.

అయినా లొంగిపోయింది. తప్పదు. . . తనున్న పరిస్థితుల్లో భర్త వదిలేస్తే. . . అమ్మా నాన్న గుండె ఆగి చచ్చిపోతారు. తన అయిష్టాన్ని బలవంతంగా గొంతు పిసికి పాతి పెట్టేసింది.

యిపుడు. . . మరలా. . .

తలుపు ఎవరో తడ్తున్న చప్పుడు.

ఆలోచనల్లో మునిగి ఉన్న పద్మ ఉలిక్కిపడి లేచింది.

గోడ గడియారం వైపు చూసింది.

ఆరు గంటలు కావస్తోంది.

పద్మ వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా రమేష్. అదే చిర్నవ్వు. మొహంలో చెరగని, చెదరని ప్రశాంతత.

కాఫీ కలుపుకుని రావటానికి వంట గదిలోకి నడిచింది.

ఆమె వెనక నడిచి - ఆమె భుజాల మీద చేతులు వేశాడు రమేష్.

వళ్ళు అసహ్యంతో జలదరించి విదిలించుకుంది.

"పద్మా డియర్. రాత్రికి రావటం లేదు" అన్నాడు హుషారుగా.

"అది చెప్పడం కోసం రావటం దేనికి?" పద్మలో దుఃఖం లోంచి పుట్టుకొచ్చిన విసురు.

"నిజమే. రాకున్నా ఎక్కడికెళ్తానో నీకు తెల్సుగా. కానీ రెండ్రోజులుంటానో, మూడ్రోజు లుంటానో నాకు తెలియదు. అందుకే రెండు జతల బట్టలు సర్దు కుందామని. . ."

బీరువా తెరిచి అందులోంచి బట్టలు తీసి బ్రీఫ్‌లో సర్దుకుంటున్న రమేష్ దగ్గరకు నడిచింది.

"మీకిదేమైనా న్యాయంగా ఉందా చెప్పండి. మనకిపుడో బాబున్నాడు. వాడికోసమైనా మీరు మీ అలవాట్లను మార్చుకోండి" అంది రెండు చేతులూ జోడించి ప్రాధేయపడుతూ.

రమేష్ పెద్దగా నవ్వాడు - ఏదో జోక్ విన్నట్లు.

"మనోహరి నా అలవాటు కాదు. నా ప్రేమ. నా ఇష్టం. నా ప్రాణం. తను మా ఆఫీస్‌లో కొత్తగా చేరిన క్షణం నించీ నేను ఆమెను ప్రేమించాను" అన్నాడు.

"చూడండి - పిల్లవాడు పెద్దయితే తన తండ్రి ఇలాంటి వాడని తెలిస్తే అసహ్యించు కుంటాడండీ. వాడి కోసమైనా. . ."

"మై డియర్ పద్మా. నేను చెప్పేదీ అదే. మనకో బాబున్నాడు. వాడి కోసమైనా నీవు నోరు మెదపకూడదు. ఓ క్షణం ఆలోచించు. నేను నిన్ను వదిలేశాననుకో. వాడి భవిష్యత్తు ఏమైపోతుంది? తండ్రి లేకుండా పెరిగేవాడి మనస్తత్వం ఎలా తయారవు తుంది? సమాజం మొగుడు వదిలేసిన దాని కొడుగ్గా వాడి పట్ల ఎలా ప్రవర్తిస్తుంది? ఆ విధంగా వాడి జీవితాన్ని నీ చేతులారా నాశనం చేసిన దానివి కావటం నీకిష్టమా" దగ్గిర కొచ్చి పద్మ కళ్ళలోకి తమాషాగా చూస్తూ అన్నాడు.

తననెవరో బలమైన నైలాన్ తాళ్ళతో కాళ్ళూ చేతులూ కట్టేసి, మాట్లాడకుండా నోట్లో గుడ్డలు కుక్కి. ... వూపిరాడకుండా ఇనుప చట్రాల మధ్య బంధించిన ఫీలింగ్ ఆమెలో.. ..

రమేష్ ఆమెను దగ్గరగా పొదివి పట్టుకుని చెవిలో రహస్యం చెప్తున్నట్లు మెల్లిగా చెప్పాడు "ఇన్నాళ్ళూ నేనేం కోరినా నా ఇష్టమే నీ ఇష్టం అనే దానివి కదా. ఇప్పుడూ అలానే అనుకో డియర్. మనోహరి అంటే నాకు ఇష్టం. . ."

పద్మ కళ్ళలో నీళ్ళు. . .

రమేష్ వెళ్ళిన కొన్ని నిముషాల వరకూ అలా రాతి బొమ్మలా నిశ్చలంగా కూచుండి పోయింది.

బాబు నిద్రలేచినట్లున్నాడు. వాడి కేరింతలు విన్పిస్తున్నాయి.

అవును. బాబు. . . . వాడి జీవితం ఏమైపోతుంది? తనకేమైనా పర్లేదు. తన బాబు జీవితం బాగుండాలి. వాడి భవిష్యత్తు బాగుండాలి. ఈ భావం ఆమె శరీరాన్ని, మనసునే కాదు. ఆత్మని కూడా బలవంతంగా లొంగదీసుకుంటూ . . . . రాక్షసంగా ఆక్రమించుకుంటూ. . .

వెళ్ళి బాబు పక్కన పడుకుంది. వాడిని దగ్గరకు తీసుకున్న వెంటనే అప్పటి వరకూ ఆనకట్టలా ఉన్నదేదో తెగి దుఃఖం ప్రవాహంలా పెల్లుబికింది.

● *మయూరి వీక్లీ, డిసెంబర్ 8, 1995* ●